రూ.100 కోట్ల ప్రభుత్వ స్థలానికి మోక్షం

- పార్కు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్
- ఫలించిన సహేలీ పోరాటం
- మిథులానగర్ ప్రభుత్వ స్థలం చుట్టూ ప్రహరీ ఏర్పాటు

18 సంవత్సరాల సహేలీ పోరాటం ఫలించింది. వంద కోట్ల ప్రభుత్వ స్థలం పరిరక్షణకు ఈవీడీఎం కమిషనర్ చర్యలు తీసుకున్నారు. దీంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


స్థలం వద్ద కాలనీకి చెందిన మహిళలు

బంజారాహిల్స్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వంద కోట్ల రూపాయల విలువ చేసే పార్కు స్థలాన్ని ఇప్పటికే కొంతమంది ఆక్రమించారు. మిగతా స్థలాన్ని కబ్జా చేసేందుకు ఎవరికి వారు ప్రయత్నిస్తున్నారు. కానీ, ఆ స్థలంలో పార్కు, కమ్యూనిటీహాల్ నిర్మించాలని కాలనీ మహిళలు 18 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నారు. స్థల పరిరక్షణ కోసం సహేలీ అనే గ్రూపును కూడా ఏర్పాటు చేసుకున్నారు. ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులు.. ఇలా కనపడిన ప్రతి ఒక్కరికీ వినతిపత్రం ఇచ్చారు. ఏ ఒక్కరూ స్పందించలేదు. కబ్జాదారుల వైపే మొగ్గు చూపించారు. జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న రంగనాథ్‌కు ఈ స్థలం గురించి తెలిసింది. స్వయంగా ఆయనే రంగంలోకి దిగి ఇటీవలే ఆక్రమణలను కూల్చివేశారు.

మూడు ఆక్రమణలు

సహేలీ ఓ వైపు పోరాటం చేస్తుండగా మరోవైపు కబ్జాదారుల కన్ను ఈ స్థలంపై పడింది. కాలనీకి ఆనుకొని ఉన్న సయ్యద్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి 250 గజాల స్థలాన్ని కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టాడు. కాలనీకి చెందిన ప్లాట్‌నంబర్ 55, 56 యజమానులు 350 గజాల చొప్పున స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మించారు. ఈ ప్లాట్లకు నకిలీనంబర్‌లను కూడా సృష్టించారు. మిగతా స్థలాన్ని కూడా ఆక్రమించేందుకు ఎవరికి వారు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదే విషయాన్ని సహేలీ ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వారు పట్టించుకోకుండా కబ్జాదారులకే వత్తాసు పలికారు. తాజాగా జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న రంగనాథ్‌కు స్థలం గురించి తెలిసింది. సహేలి ఇచ్చిన వినతిపత్రాలను పరిశీలించారు. విచారించగా స్థలం జీహెచ్‌ఎంసీ పార్కుల విభాగంలోనే ఉన్నట్టు తేలింది. రెండు రోజుల క్రితం ఆయన మిథులానగర్‌కు చేరుకున్నారు. జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులను, సిబ్బందిని రంగంలోకి దించి ఆక్రమణలను కూల్చివేయించారు. చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఆదేశించారు. బయోడైవర్సిటీ అధికారులను పిలిచి పచ్చదనం అభివృద్ధి చేయాలని సూచించారు. ప్లాట్‌నంబర్ 55, 56 యజమానులు ఆక్రమించిన స్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మించనున్నట్టు ప్రకటించారు. ఇదంతా కొన్ని గంటల్లోనే పూర్తి చేశారు. ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్ స్పందించడంతో కాలనీ మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కబ్జాదారులు మరింత రెచ్చిపోకముందే పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఇదీ అసలు కథ..

బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 మిథులానగర్ కాలనీలో వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు అధికంగా నివసిస్తుంటారు. కాలనీ మధ్యలో 5,060 గజాల లే అవుట్ స్థలాన్ని వదిలేశారు. కమ్యూనిటీ పరంగా దీనిని ఉపయోగించుకోవాలని కాలనీవాసులు భావించారు. ఆ స్థలంలో పార్కును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు అంగీకరించారు. జీహెచ్‌ఎంసీ రికార్డుల్లో కూడా పార్కు కోసం స్థలం కేటాయించినట్టు నమోదు చేశారు. కానీ, ఆ దిశగా ప్రయత్నాలు ఆరంభించలేదు. స్థలంలో ఎలాగైనా పార్కు, కమ్యూనిటీహాల్‌ను ఏర్పాటు చేసుకోవాలని కాలనీ మహిళలంతా కలిసి సహేలీ అని సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. దీని ద్వారా 2006 నుంచి పార్కు కోసం పోరాటం మొదలు పెట్టారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు.


స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించిన జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్


ఆక్రమణను జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేసిన దృశ్యం


సంస్కృతి ఫౌండేషన్ ప్రతినిధికి రాఖీలను అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతితో విద్యార్థినులు

ఆర్మీ జవాన్లకు రాఖీలను పంపించిన విద్యార్థినులు

బేగంపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఇతర విద్యార్థినులు సంస్కృతి ఫౌండేషన్ ప్రతినిధులకు రాఖీలను గురువారం అందజేశారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని దేశ సరిహద్దులో విధులు నిర్వహిస్తున్న ఆర్మీ జవాన్లకు ఈ రాఖీలను సోదర, సోదరీ భావంతో అందజేయాలని విద్యార్థినులు ఫౌండేషన్ ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి, కళాశాల సంస్కృతి ఫౌండేషన్ నామినీ మెంబర్ డా.కె.వెంకటేశ్వర్లు, పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన పవిత్ర ఉత్సవాలు


శ్రీవిజయలక్ష్మి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న పండితులు

ఎర్రగడ్డ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శ్రీవిజయలక్ష్మీ దేవాలయంలో పవిత్ర ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను నాలుగు రోజులపాటు నిర్వహించనున్నారు. గురువారం ఆలయంలో శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, అంకురారోపణ, శాత్తుముర్రై, తీర్థ ప్రసాద గోష్ఠి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ ప్రధానకార్యదర్శి పి.జనార్దన్, కోశాధికారి ఎస్‌వీరెడ్డి, ప్రధాన అర్చకులు గట్టు రంగాచారి, మేనేజర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన జితేందర్‌ను అభినందిస్తున్న తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సీపీ.శేషగిరిరావు, ప్రతినిధులు టి.సర్సింగ్‌రావు, రాజయ్య, ప్రభాకర్‌రెడ్డి తదితరులు - బేగంపేట, జులై 18 (ఆంధ్రజ్యోతి)

హైదరాబాద్- వాడి మార్గంలో ప్రత్యేక రైళ్లు

సికింద్రాబాద్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్- వాడి- హైదరాబాద్ మార్గంలో ప్రత్యేక రైళ్ల నడుపుతున్నట్టు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. హైదరాబాద్- వాడి స్పెషల్ (రైల్ నం: 07175) ఈనెల 20న ఉదయం 10.05గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి, మధ్యాహ్నం 3.30గంటలకు వాడి చేరుతుంది. వాడి- హైదరాబాద్ స్పెషల్ (రైల్ నం: 07176) ఈనెల 20న సాయంత్రం 4.20గంటలకు వాడి నుంచి బయల్దేరి, రాత్రి 9.20గంటలకు హైదరాబాద్ చేరుతుంది. హైదరాబాద్- వాడి స్పెషల్ (రైల్ నం: 07177) ఈనెల 22న ఉదయం 5.00గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి, 10.15గంటలకు వాడి చేరుతుంది. వాడి- హైదరాబాద్ స్పెషల్ (రైల్ నం: 07178) ఈనెల 22న ఉదయం 11.05గంటలకు వాడి నుంచి బయల్దేరి సాయంత్రం 4.00గంటలకు హైదరాబాద్ చేరుతుంది.

రెండు రైళ్ల పాక్షిక రద్దు

ఈనెల 21న జైపూర్ నుంచి బయల్దేరే జైపూర్- హైదరాబాద్ (నం: 07116) రైలును జైపూర్- అజ్మీర్ మధ్య రద్దు చేశారు. ఈనెల 19న హైదరాబాద్ నుంచి బయల్దేరే హైదరాబాద్- జైపూర్ (నం: 07115) రైలును అజ్మీర్- జైపూర్ మధ్య రద్దు చేశారు.

'అర్చకుల బదిలీలను నిలిపేయాలి'

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో అధికారులు, సిబ్బందితోపాటు అర్చకుల బదిలీలకు జరుగుతున్న ప్రయత్నాన్ని నిలిపేయాలని భాగ్యనగర అర్చక పరిషత్ అధికారులకు విజ్ఞప్తి చేసింది. దైవాన్ని నమ్ముకుని దశాబ్దాలుగా ఒకేచోట పనిచేస్తున్న అర్చకులను బదిలీల పేరుతో మరో ప్రాంతానికి మార్చడం సరైంది కాదన్నారు. బదిలీలు నిలిపివేయడంతోపాటు వారికి పెన్షన్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. అర్చకుల బదిలీ నిలిపివేత అంశంపై త్వరలోనే సీఎం, మంత్రితోపాటు దేవాదాయ శాఖ అధికారులను కలిసి విన్నవించనున్నట్లు పరిషత్ అధ్యక్షుడు భాస్కరబట్ల రామశర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రేమ పేరుతో బాలికపై అత్యాచారం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు
- బడంగ్‌పేట్‌లో ఘటన

సరూర్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను లోబరచుకున్న ఓ యువకుడు ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన సంఘటన మీర్‌పేట్ పోలీసుస్టేషన్ పరిధిలోని బడంగ్‌పేట్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బడంగ్‌పేట్‌లో నివసిస్తోంది. బడంగ్‌పేట్‌కు చెందిన యువకుడు అదేప్రాంతంలో పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. యువకుడి కుటుంబం, బాలిక కుటుంబం బడంగ్‌పేట్‌లోని ఒకే అపార్ట్‌మెంట్‌లోని వేర్వేరు ఫ్లాట్లలో అద్దెకుంటున్నాయి. ఈ క్రమంలో ఇరువురి మధ్య పరిచయం ఏర్పడగా, దానిని అవకాశంగా తీసుకున్న యువకుడు (24) బాలికను(15) ప్రేమ పేరుతో లోబరచుకుని అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇటీవల బాలిక అస్వస్థతకు గురవగా ఆస్పత్రికి తీసుకెళ్లడంతో గర్భవతి అని తేలింది. దాంతో బాలిక తల్లిదండ్రులు నిలదీయగా జరిగిన విషయం చెప్పింది. గురువారం బాలిక కుటుంబసభ్యులు మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు తెలిపారు.

థీమ్ పార్కుల అభివృద్ధికి ప్రణాళికలు

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి


లోటస్‌పాండ్‌లో పార్కును పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

బంజారాహిల్స్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): థీమ్‌పార్కులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో చేపట్టిన వివిధ సివిల్ పనుల టెండర్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. బంజారాహిల్స్ లోటస్‌పాండ్, పాత్‌వే, మంగోలియా బేకరీ వద్ద గల పార్క్‌ను కమిషనర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. లోటస్ పాండ్‌లోని సివరేజీ కనెక్షన్లను తొలగించాలని, నాలాలలో స్ట్రామ్‌వాటర్, ఫ్లోటింగ్ మెటీరియల్ రాకుండా మెష్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాడైన పాత్‌వేలకు వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. మంగోలియా బేకరీ నుంచి రోడ్ నెంబర్ 44- 45 వరకు రోడ్డు, సివరేజీ పనులు చేపట్టడానికి సంబంధించిన సివిల్ వర్క్ టెండర్ల ప్రక్రియను త్వరిత గతిన పూర్తిచేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు చెప్పారు. స్థానికంగా ఉన్న పార్కులో సివరేజీ నీరు నిలుస్తున్నాయని, శాశ్వతంగా పరిష్కారించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హై టెన్షన్ వైర్ల దిగువన గల అన్ని పార్కులను థీమ్ పార్కులుగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టాలని యూబీడీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్‌కమిషనర్, అనురాగ్‌జయంతి, ఈఈ విజయ కుమార్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, వాటర్ వర్క్స్, స్పోర్ట్స్, శానిటేషన్, ఇంజనీరింగ్, మెడికల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.


కార్యక్రమ న్యూస్ లెటర్‌ను ఆవిష్కరిస్తున్న ఇబ్రహీం అలీ సిద్దిఖీ తదితదరులు

ఉర్దూ భాషలో టెక్నాలజీ సంబంధిత కోర్సులు

బంజారాహిల్స్,జూలై 18(ఆంధ్ర జ్యోతి): భవిష్యత్ తరాల విద్యార్థులు టెక్నాలజీని స్థానిక భాషల్లో నేర్చుకునేందుకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీయూ) సంస్థ కృషి చేస్తుందని సుల్తాన్ ఉలూం ఎడ్యుకేషన్ బోర్డు మెంబర్ జస్టిస్ ఇబ్రహీం అలీ సిద్దిఖి తెలిపారు. బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో గురువారం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికేషన్స్ ఇన్ ఉర్దూ అనే అంశంపై మూడురోజుల సెమినార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు జరిగే ఈ సదస్సులో ఉర్దూ భాష పండితులతో పాటు ఉర్దూ భాష గురించి తెలిసిన మేధావులు టెక్నాలజీని ఉపయోగించి ఎక్కువ మందికి విషయ పరిజ్ఞానానికి ఉపయోగపడే అంశాలపై చర్చిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్మసి కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు, ఎంబీఏ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మీ రావత్, డాక్టర్ అయేషా నాజ్, సల్మా ఫౌజియా, మలిహానాజ్, రిజిస్ట్రార్ నర్సింహారావు పాల్గొన్నారు.


మొక్కను నాటి నీరుపోస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : తలసాని

బంజారాహిల్స్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందుకు మొక్కలు నాటి పరిరక్షించాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా గురువారం సనత్‌నగర్‌లోని రవీంద్రనగర్‌లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిపోతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మి, జీహెచ్‌ఎంసీ ఈఈ ఇందిర, డీఈ మోహన్, వాటర్ వర్క్స్ జీఎం హరిశంకర్, హార్టికల్చర్ అధికారి జ్యోత్స్న, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


జూబ్లీహిల్స్‌లోని పద్మాలయ స్టూడియోలో సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్‌బాబు తనయుడు, నూతన హీరో జయకృష్ణ పుట్టిన రోజు వేడుకలను ఆలిండియా మహేష్, కృష్ణ సేన అధ్యక్షుడు ఖాదర్‌గోరి ఆధ్వర్యంలో నిర్వహించారు. మల్లేష్, జయకృష్ణ తల్లి మృదుల తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న బేగంపేట ఇన్‌స్పెక్టర్ రామయ్య

పీజీ కళాశాలలో సమస్యలను పరిష్కరించాలి : ఏబీవీపీ

బేగంపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని పీజీ కళాశాలలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో కలిసి ఏబీవీపీ విద్యార్థి నాయకులు గురువారం కళాశాల ఆవరణలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు. అక్కడికి వచ్చిన పోలీసులకు విద్యార్థులకు స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ విద్యార్థి నాయకులు బాలకృష్ణ, బాలు, రమేష్, సాయిరాం, సంతోష్ తదితరులు మాట్లాడుతూ గతంలో కళాశాలలో సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చినా స్పందించలేదన్నారు. ప్రధానంగా కళాశాల గ్రౌడ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, హస్టల్‌లో దోమల బెడదను నివారించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను పునరుద్ధరించాలన్నారు. కళాశాలలోని విద్యార్థులకు నిత్యం వైద్య సేవలు అందుబాటులో ఉంచాలన్నారు. పూర్తి సౌకర్యాలతో కూడిన క్యాంటిన్‌ను ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. స్టడీహాల్‌ను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.

ఆగస్టు 1, 2 తేదీల్లో ఏఐఎఫ్‌డీఎస్ జాతీయ సమావేశాలు

రాంనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏఐఎఫ్‌డీఎస్) జాతీయ సమావేశాలను ఆగస్టు 1, 2 తేదీల్లో బాగ్‌లింగంపల్లిలో గల ఓంకార్ భవన్‌లో నిర్వహిస్తున్నామని ఆ సంస్థ జాతీయ కన్వీనర్ ఎం. రాజశేఖర్ తెలిపారు. మహాసభ వాల్‌పోస్టర్‌ను గురువారం బాగ్‌లింగంపల్లిలో ఆవిష్కరించారు. మహాసభలకు 18 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర బాలికల విభాగం కన్వీనర్ సావిత్రి, నాయకులు జబ్బార్ నాయక్, రమేష్, కుమార్, శ్రీకాంత్, విష్ణు, గోపాల్ పాల్గొన్నారు.

కుమార్తెపై తండ్రి అత్యాచారం

- బాలిక పక్కింటి వారికి చెప్పడంతో పోలీసులకు సమాచారం
- నిందితుడి అరెస్టు.. రిమాండ్

పీర్జాదిగూడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కంచె చేను మేసినట్లు ఓ తండ్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న తన కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ అమానవీయ ఘటన బుధవారం మేడిపల్లిలో జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తల్లి ఇంట్లో లేకపోవడంతో తనపై తండ్రి పాల్పడ్డ ఘోరాన్ని 12 ఏళ్ల ఆ బాలిక పక్కింటి మహిళకు చెప్పుకుంది. బాలిక చదువు కోసం ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటుండగా భర్తతో గొడవ పడ్డ ఆమె తల్లి ఇటీవలే పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో హాస్టల్‌లో ఉంటున్న కుమార్తెను తండ్రి రెండు రోజుల క్రితమే ఇంటికి తీసుకొచ్చాడు. ఒంటరిగా ఉన్న కుమార్తెపై బుధవారం అత్యాచారానికి ఒడిగట్టాడు. ఏం చేయాలో పాలుపోని ఆ బాలిక తండ్రి ఇంటి నుంచి బయటకు వెళ్లగానే పక్కింటి మహిళకు చెప్పింది. దీంతో వారు మేడిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని విషయాన్ని నిర్ధారించుకున్నాక పోలీసులు తండ్రిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.

వాగ్దానాలను నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం


రైతులకు రుణమాఫీ చేయడంతో సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతయాదవ్, కాంగ్రెస్ నాయకులు - బేగంపేట, జులై 18 (ఆంధ్రజ్యోతి)

ఎర్రగడ్డ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకుంటోందని, రైతన్నల కోసం రుణమాఫీ చేసి ఇది ప్రజాప్రభుత్వం అని నిరూపించుకుంటోందని కార్పొరేటర్ సీఎన్. సీఎన్‌రెడ్డి అన్నారు. గురువారం రైతుల రుణమాఫీ ప్రారంభించిన సందర్భాన్ని పురస్కరించుకొని ఎర్రగడ్డలోని రైతుబజార్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులు, కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎర్రగడ్డ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు దూడల రవిగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి రైతు కుటుంబానికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తుందన్నారు. 12వ తేదీ డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 వరకు రైతుల పేరిట ఉన్న బకాయిలకు రుణమాఫీ వర్తిస్తుందని పేర్కొన్నారు. రైతుల రుణఖాతాలో నేరుగా మాఫీ సొమ్ము జమ అవుతుందన్నారు. ఇందుకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎర్రగడ్డ రైతుబజార్ రైతు రాములు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నల పాలిట అండగా నిలుస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎర్రగడ్డ రైతుబజార్ ఎస్టేట్‌అధికారి పి.రమేష్, కాంగ్రెస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం మైనార్టీ విభాగం చైర్మన్ మొహ్మద్ మోసిన్ ఖురేషి, నాయకులు మహ్మద్ సర్దార్, ఎస్ఎస్‌కే పేగడ ఆకాష్, దూడల సురేష్‌గౌడ్, శశికుమార్, రైతులు సుగుణమ్మ, రాజయ్య, చంద్రమ్మ, ఈశ్వరమ్మ, రైతు బజార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, రైతులు



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

ఓం సాయి కాలనీ సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే

తిరుమలగిరి జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఓం సాయి కాలనీలో సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. గురువారం బొల్లారంలోని ఓం సాయి కాలనీలో పర్యటించారు. రాత్రిపూట కాలనీలో పాములు సంచరిస్తున్నాయని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు స్థానికులు వివరించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ కంటోన్మెంట్ బోర్డు సీఈఓ దృష్టికి తీసుకు వెళ్లి వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు పాముల సంచారానికి అడ్డుకట్ట వేయడానికి చర్యలు చేపట్టే విధంగా మాట్లాడుతానని తెలిపారు.

● తిరుమలగిరి లాల్‌బజార్‌లోని భక్తాంజనేయ స్వామి ఆలయం వెళ్లడానికి రక్షణ శాఖ అధికారులు మూసివేసిన గేటును వెంటనే తెలిపించాలని కోరుతూ గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రంగా రవీందర్ గుప్తా గురువారం ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో జార్జ్, ఎల్లీ రాజ్‌కుమార్, అమిత్‌లు ఉన్నారు.

● సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజారులోని గండిమైసమ్మ ఆలయంలో ఆదివారం జరిగే బోనాల పండగకు ముఖ్యఅతిథిగా రావాలని కోరుతు రెజిమెంటల్‌బజారు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ ధర్మకర్తలు అల్లాడి గౌరిశంకర్, నందికంటి రవి, శ్రీనివాస్, రాజులు మర్యాదపూర్వకంగా గురువారం ఎమ్మెల్యే శ్రీగణేష్ నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు.



ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో చండీహోమం

సికింద్రాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో గురువారం చండీ హోమం ఘనంగా జరిగింది. ప్రధానార్చకులు రామతీర్థశర్మ, వేణుమాధవశర్మ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ హోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేసినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి మనోహర్‌రెడ్డి తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

ఓపెన్ జిమ్ పనులను పరిశీలించిన కార్పొరేటర్

బౌద్ధనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి టీఆర్‌టీ కాలనీ పార్కులో జరుగుతున్న ఓపెన్ జిమ్ పనులను గురువారం అధికారులతో కలిసి కార్పొరేటర్ సామల హేమ పరిశీలించారు. ఓపెన్ జిమ్ పనులు తొందరగా పూర్తి అయ్యేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. సుమారు రూ.70 లక్షలతో ఓపెన్ జిమ్‌లను చేపట్టామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈఈ సువర్ణ, ఏఈ కౌశిక్, బీఆర్‌ఎస్ నాయకుడు శేఖర్ పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా నల్గొండ జిల్లా ఇన్‌చార్జిగా రమేష్



ఆకారం రమేష్

బౌద్ధనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓబీసీ మోర్చా నల్గొండ జిల్లా ఇన్‌చార్జిగా చిలకలగూడకు చెందిన ఆకారం రమేష్ నియామితులయ్యారు. ప్రసుత్తం రమేష్ తెలంగాణ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారిగా కొనసాగుతున్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ 21 జిల్లాలకు ఇన్‌చార్జిలను నియామించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో బీజేపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారికి వివరిస్తామన్నారు.



● ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వానం

సురిటీ అప్పయ్య సేవా సమితి అధ్యక్షుడు సురిటీ కామేశ్వర్ అధ్వర్యంలో ఈ నెల 21న జరుగనున్న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆషాడ బోనాల జాతరలో పాల్గొనాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న వైస్ చైర్మన్ సురిటీ రామేశ్వర్. కార్యక్రమంలో సేవా సమితి ఉపాధ్యక్షులు బోయిని గోపాల్, మహిళా విభాగ అధ్యక్షురాలు రాధిక, ప్రధాన కార్యదర్శి అంబిక, జాయింట్ సెక్రటరీ ఇందిరా ఘన్ శ్యామ్, శారద, నరహరి, శేఖర్, నీలం గౌరీ శంకర్, సందీప్, కే.ఎం.కృష్ణ తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

-సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



అడ్డగుట్ట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో రేతిఫైల్ బస్టాండు వద్ద గుర్తుతెలియని ఓ వృద్ధుడు మతి చెందిన సంఘటన గురువారం గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రేతిఫైల్ బస్టాండు వద్ద 60 ఏళ్ల గుర్తుతెలియని వృద్ధుడు చనిపోయి ఉన్నాడని స్థానికులనుంచి సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికివెళ్లి పరిశీలించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్త గాంధీ మార్చురీకి తరలించారు. అనారోగ్యంతో చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడ్డగుట్టలో వ్యక్తి అదృశ్యం



సురేష్

అడ్డగుట్ట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... అడ్డగుట్ట పెట్రోల్ బంక్ వెనుక వైపు ప్రాంతానికి చెందిన సురేష్(24) కూలిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 17న ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి బయటికి వెళ్లిన అయన తిరిగి రాత్రి వరకు ఇంటికి రాలేదు. అతని సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి ఉండడంతో భయాందళనకు గురైన భార్య ఉమా మహేశ్వరి వెంటనే తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌లో అదేరోజు రాత్రి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సామూహిక సాయి వ్రతాలు





సాయిబాబాకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తురాలు, సామూహిక సాయి వ్రతంలో భక్తులు

పద్మారావునగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా పద్మారావునగర్‌లోని సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న సాయి సప్తాహ ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు ఉదయం శ్రీ సాయి స్వరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో సామూహిక సాయివ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పల్లకీ సేవ...

సాయి సప్తాహ ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం పల్లకీ సేవలో భాగంగా రకరకాల పుష్పాలు, విద్యుద్ దీపాలతో అలంకరించిన పల్లకిలో సాయినాథున్ని పద్మారావునగర్ పురవీధులలో ఊరేగించారు. రాత్రికి పంచభూత హారతి ఇచ్చారు.



సంస్కృతి ఫౌండేషన్ ప్రతినిధికి రాఖీలను అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతితో విద్యార్థినులు

ఆర్మీ జవాన్లకు రాఖీలను పంపిన విద్యార్థినులు

బేగంపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇతర విద్యార్థినులు సంస్కృతి ఫౌండేషన్ ప్రతినిధులకు 78 రాఖీలను గురువారం అందజేశారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని దేశ సరిహద్దులో విధులు నిర్వహిస్తున్న ఆర్మీ జవాన్లకు ఈ రాఖీలను సోదర, సోదరీ భావంతో అందజేయాలని విద్యార్థినులు ఫౌండేషన్ ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి, కళాశాల సంస్కృతి ఫౌండేషన్ నామినీ మెంబర్ డా.కె.వెంకటేశ్వర్లు, పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నారాయణగూడ వైఎంసీఏలో డిస్కౌంట్‌పై బ్రాండెడ్ దుస్తుల విక్రయాలు

సికింద్రాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నారాయణగూడ వైఎంసీఏలో గురువారం నుంచి లగ్జరీ బ్రాండెడ్ దుస్తులను భారీ తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. పురుషులు, మహిళలు, పిల్లలకు, పలు రకాల దుస్తులు లభిస్తాయని, కుట్టు కూలీ ధరలకే దుస్తులు విక్రయిస్తున్నామని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు విక్రయాలు కొనసాగుతాయన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న బేగంపేట ఇన్‌స్పెక్టర్ రామయ్య

పీజీ కళాశాలలో సమస్యలను పరిష్కరించాలి : ఏబీవీపీ

బేగంపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని పీజీ కళాశాలలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో కలిసి ఏబీవీపీ విద్యార్థి నాయకులు గురువారం కళాశాల ఆవరణలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళన చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు విద్యార్థులకు స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ విద్యార్థి నాయకులు బాలకృష్ణ, బాలు,రమేష్, సాయిరాం, సంతోష్ తదితరులు మాట్లాడుతూ గతంలో కళాశాలలో సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చినా స్పందించలేదన్నారు. ప్రధానంగా కళాశాల గ్రౌండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, హస్టల్‌లో దోమల బెడదను నివారించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను పునరుద్ధరించాలన్నారు. కళాశాలలోని విద్యార్థులకు నిత్యం వైద్య సేవలు అందుబాటులో ఉంచాలన్నారు. పూర్తి సౌకర్యాలతో కూడిన క్యాంటిన్‌ను ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. స్టడీహాల్‌ను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.

కుమార్తెపై తండ్రి అత్యాచారం

● బాలిక పక్కింటి వారికి చెప్పడంతో వెలుగులోకి

● నిందితుడి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

పీర్జాదిగూడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కంచె చేను మేసినట్లు ఓ కీచక తండ్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న తన కన్న కూతురిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ అమానవీయ ఘటన బుధవారం మేడిపల్లిలో జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తల్లి ఇంట్లో లేకపోవడంతో తనపై తండ్రి పాల్పడ్డ ఘోరాన్ని 12 ఏళ్ల ఆ బాలిక పక్కింటి మహిళకు చెప్పుకుంది. బాలిక చదువు కోసం ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటుండగా భర్తతో గొడవ పడ్డ ఆమె తల్లి ఇటీవలే పుట్టింటికి వెళ్ళింది. ఈ క్రమంలో హాస్టల్‌లో ఉంటున్న కూతురిని తండ్రి రెండు రోజుల క్రితమే ఇంటికి తీసుకొచ్చాడు. ఒంటరిగా ఉన్న కూతురిపై బుధవారం అత్యాచారానికి ఒడిగట్టాడు.

ఏం చేయాలో పాలుపోని ఆ బాలిక తండ్రి ఇంటి నుంచి బయటకు వెళ్లగానే పక్కింటి మహిళకు చెప్పింది. దీంతో వారు మేడిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని విషయాన్ని నిర్ధారించుకున్నాక పోలీసులు తండ్రిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.

ముస్లింలపై యూపీ సర్కార్ వివక్ష

● అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం

హైదరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ముస్లింల పట్ల వివక్ష చూపుతున్నదని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. ముజఫర్‌నగర్‌లో నిర్వహించనున్న కన్వర్ యాత్ర మార్గంలో రోడ్‌సైడ్ స్టాల్స్, ఫుడ్‌స్టాల్స్ బోర్డులపై యజమానుల పేర్లను ప్రకటించాలని పోలీసులు ఆదేశాలు జారీ చేయడం అంటే రాజ్యాంగాన్ని, చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. గురువారం దారుల్‌సలాం పార్టీ కార్యాలయంలో అసదుద్దీన్ ఒవైసీ విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యవహారం పరిశీలిస్తే అయనను హిట్లర్ ఆవహించినట్టుగా ఉందన్నారు. ఉత్తరప్రదేశ్‌లో పోలీసుల చర్యతో ముజఫర్‌నగర్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. అనైతిక, వివక్షత చర్యలను వ్యతిరేకించడం నేరం కాదని, రెండు సమాజాల మధ్య ఘర్షణలకు కారణమైన వారిపై కేసు నమోదు చేయాలన్నారు.

పోలీసు నిబంధనల కారణంగా ముజఫర్‌నగర్‌లోని అన్ని దుకాణాల నుంచి ముస్లిం ఉద్యోగులు ఉద్వాసనకు గురయ్యారని పేర్కొన్నారు. ఈ చర్యలను రాజ్యాంగంలోని ఆర్టికల్ 17ను ఉల్లంఘించినట్టు పరిగణిస్తామన్నారు.



కార్యక్రమ న్యూస్ లెటర్‌ను ఆవిష్కరిస్తున్న ఇబ్రహీం అలీ సిద్దిఖీ తదితరులు

ఉర్దూ భాషలో టెక్నాలజీ సంబంధిత కోర్సులు

బంజారాహిల్స్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాల విద్యార్థులు టెక్నాలజీని స్థానిక భాషల్లో నేర్చుకునేందుకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీయూ) సంస్థ కృషి చేస్తుందని సుల్తాన్ ఉలూం ఎడ్యుకేషన్ బోర్డు మెంబర్ జస్టిస్ ఇబ్రహీం అలీ సిద్దిఖీ తెలిపారు. బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో గురువారం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికేషన్స్ ఇన్ ఉర్దూ అనే అంశంపై మూడురోజుల సెమినార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు జరిగే ఈ సదస్సులో ఉర్దూ భాష పండితులతోపాటు ఉర్దూ భాష గురించి తెలిసిన మేధావులు టెక్నాలజీని ఉపయోగించి ఎక్కువ మందికి విషయ పరిజ్ఞానానికి ఉపయోగపడే అంశాలపై చర్చిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు, ఎంబీఏ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మి రావత్, డాక్టర్ అయేషానాజ్, సల్మా ఫౌజియా, మలిహానాజ్, రిజిస్ట్రార్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



అమ్మమాట అంగన్‌వాడీ బాట ర్యాలీని హమాల్ బస్తీలో నిర్వహిస్తున్న టీచర్ కుల్సుమ్, భాగ్య, బస్తీవాసులు.

-పద్మారావునగర్, ఆంధ్రజ్యోతి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడాన్ని హర్షిస్తూ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి గురువారం తార్నాకలోని తన క్యాంపు కార్యాలయం ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి



మొక్కను నాటి నీరుపోస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: తలసాని

బంజారాహిల్స్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందుకు మొక్కలు నాటి పరిరక్షించాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా గురువారం సనత్‌నగర్‌లోని రవీంద్రనగర్‌లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిపోతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మి, జీహెచ్‌ఎంసీ ఈఈ ఇందిర, డీఈ మోహన్, వాటర్ వర్క్స్ జీఎం హరిశంకర్, హార్టికల్చర్ అధికారి జ్యోత్స్న, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్- వాడి మార్గంలో ప్రత్యేక రైళ్లు

సికింద్రాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్-వాడి- హైదరాబాద్ మార్గంలో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. హైదరాబాద్- వాడి స్పెషల్ (రైల్ నం: 07175) ఈనెల 20న ఉదయం 10.05గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి, మధ్యాహ్నం 3.30గంటలకు వాడి చేరుతుంది. వాడి- హైదరాబాద్ స్పెషల్ (రైల్ నం: 07176) ఈనెల 20న సాయంత్రం 4.20గంటలకు వాడి నుంచి బయల్దేరి, రాత్రి 9.20 గంటలకు హైదరాబాద్ చేరుతుంది. హైదరాబాద్- వాడి స్పెషల్ (రైల్ నం: 07177) ఈనెల 22న ఉదయం 5.00గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి, 10.15గంటలకు వాడి చేరుతుంది. వాడి-హైదరాబాద్ స్పెషల్ (రైల్ నం: 07178) ఈనెల 22న ఉదయం 11.05గంటలకు వాడి నుంచి బయల్దేరి సాయంత్రం 4.00గంటలకు హైదరాబాద్ చేరుతుంది.

రెండు రైళ్ల పాక్షిక రద్దు

ఈనెల 21న జైపూర్ నుంచి బయల్దేరే జైపూర్- హైదరాబాద్ (నం: 07116) రైలును జైపూర్- అజ్మీర్ మధ్య రద్దు చేశారు. ఈనెల 19న హైదరాబాద్ నుంచి బయల్దేరే హైదరాబాద్- జైపూర్ (నం: 07115) రైలును అజ్మీర్- జైపూర్ మధ్య రద్దు చేశారు.

నేటి నుంచి గరికపాటి ప్రవచనాలు

చిక్కడపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆనంద్ గ్రూప్ ఆధ్వర్యంలో చేపట్టిన ధార్మిక కార్యక్రమంలో భాగంగా ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావుచే శ్రీ మద్భాగవత ప్రవచన ప్రసంగాల కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. డీడీ కాలనీ అహోబిలమఠంలో రోజూ సాయంత్రం 6 గంటలకు జరుగుతుందన్నారు.



చేనేత వస్త్ర ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వస్త్రాలను పరిశీలిస్తున్న వినియోగదారులు

తార్నాక ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన

తార్నాక, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు ఫ్యాషన్ వస్త్రాలను ఒకే వేదికపై అందించేందుకు కళా సిల్క్ సొసైటీ ఆధ్వర్యంలో తార్నాకలోని ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటుంది. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పోచంపల్లి చీరలు, బెడ్ షీట్స్, వెస్ట్ బెంగాల్ జాందాన్ని చీరలు, రాజస్థానీ కోటా చీరలు, మంగళగిరి, ఉప్పాడ, చీరాల, వెంకటగిరి, ధర్మవరం చీరలు, కలంకారి చేనేత డ్రెస్ మెటీరియల్, లక్నో చెకెన్ వర్క్ కుర్తిస్, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు, తిరోక్క్ వస్త్రాలు ఎగ్జిబిషన్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని ఎగ్జిబిషన్ నిర్వహకులు వికాస్ జైన్ గురువారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి చేనేత హస్త కళాకారులంతా ఒకే చోట చేరి 50 స్టాళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, 15 రోజులుగా ఎగ్జిబిషన్‌కు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. ఈ చేనేత హస్తకళా ప్రదర్శన ఈ నెల 22 వరకు తార్నాకలోని ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో కొనసాగుతుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకుని చేనేత హస్తకళలను ప్రోత్సహించాలన్నారు.



మాజీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న సికింద్రాబాద్ ఆర్యవైశ్య క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, తదితరులు

సికింద్రాబాద్ ఆర్యవైశ్య క్లబ్ సేవలు ఎనలేనివి

బౌద్ధనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఆర్యవైశ్య క్లబ్ సేవలు ఎనలేనివిని పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు అన్నారు. నామాలగుండు బీఎస్‌ఆర్ గార్డెన్‌లో సికింద్రాబాద్ అధ్యక్షుడు ప్రొద్దుటూరి వెంకటేశ్వరరావు(బాబు) అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నంగనూరి సంపత్‌కుమార్, ప్రత్యేక అతిథి మాజీ అధ్యక్షుడు నాగిళ్ల శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సికింద్రాబాద్ ఆర్యవైశ్య క్లబ్ ప్రారంభించి 31 సంవత్సరాలు అయిందని, ఆర్యవైశ్య క్లబ్ అభివృద్ధికి పలువురు ముందుకు రావడం సంతోషకరమన్నారు. సికింద్రాబాద్ ఆర్యవైశ్య క్లబ్ ఎన్నో స్వచ్ఛంద సేవకార్యక్రమాలు నిర్వహించిందన్నారు. 31 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. అనంతరం పలువురికి పూలమొక్కలు ఇచ్చి ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో మంచికంటి రాధిక, గంపా వినోభా, ప్రధాన కార్యదర్శి టి.ప్రభాకర్, కోశాధికారి పి.రమేష్, కె.సురేష్‌బాబు పాల్గొన్నారు.



గృహ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గృహ కార్మికులకు సమగ్రచట్టం తేవాలి

● తెలంగాణ రాష్ట్ర గృహ కార్మికుల యూనియన్ డిమాండ్

బౌద్ధనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గృహ కార్మికుల కోసం సమగ్రచట్టం తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర గృహ కార్మికుల యూనియన్ డిమాండ్ చేసింది. గురువారం సాయంత్రం వారాసిగూడ రెడ్‌రోజ్ ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం నిర్వహించారు. మోంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ బ్రదర్ వర్గీస్ తెకనేత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గృహ కార్మికుల హక్కులను గుర్తించి, వాటిని పరిరక్షించడంతో పాటు హింస, వివక్షకు వ్యతిరేకంగా వారిని కాపాడేందుకు తెలంగాణలో సమగ్ర చట్టం అవసరమన్నారు. కనీసం వేతనం పన్నెండు వేలు ఉండేలా చట్టం అమలు చేయాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గృహ కార్మికుల యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు వల్లాల మంజుల మాట్లాడుతూ గృహ కార్మికుల పోరాటాలు, సాధించిన విజయాలు మహిళా ఉద్యమానికి, కార్మిక ప్రపంచానికి స్ఫూర్తినిస్తాయన్నారు. గృహ కార్మికుల హక్కులు, సాధన కోసం నిరంతరం పోరాడతామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ, ఏపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సిస్టర్ లూర్డ్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సల్లావుద్దీన్, బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ, రిటైర్డ్ ఎఎల్‌ఓ రమణమూర్తి, అడ్మిన్ ఎస్సై సుధాకర్, ఇందిర, మాధురి, స్వర్ణ, ఆకాశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



వ్యక్తిత్వవికాస కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

విద్యను అభ్యసిస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలి

పద్మారావునగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యను అభ్యసిస్తూనే నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వవికాస నిపుణులు డాక్టర్ గంపా నాగేశ్వర రావు అన్నారు. పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కళాశాలలో గురువారం విద్యార్థుల కోసం నిర్వహించిన వ్యక్తిత్వవికాసం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్షాలను చేరుకోవాలంటే వ్యక్తిగత క్రమశిక్షణను అలవర్చుకోవాలని, తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఎన్.హేమలత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. అమరనాదశర్మ, పరిపాలన అధికారి జి.రాహుల్‌యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఈ నెల 21న జరుగనున్న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆషాడ బోనాల జాతరలో పాల్గొనాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌ను ఆహ్వానిస్తున్న దేవాదాయ శాఖ సహాయ కామిషనర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి గుత్తా మనోహర్ రెడ్డి. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు, అర్చకులు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్, నాయకులు నరేంద్ర పాల్, సందీప్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

-సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి